క్లుప్తంగా

ఎన్టీఆర్‌లో విద్యార్థులకు అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు తయారు చేసేందుకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు అధ్యాపకులు ప్రాజెక్టులు తయారు చేసేందుకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. అధ్యాపకులు అర్జున్‌కుమార్, శివప్రసాద్, నాగలక్ష్మి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు గౌరవాన్ని తెచ్చింది కాంగ్రెస్

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు ఇచ్చి గౌరవించింది కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో సర్పంచ్‌లకు తెలియకుండా ప్రభుత్వం వారి నిధులు వాడుకున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పంచాయతీలకు నేరుగా నిధులు అందజేసి సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు తగిన గౌరవం ఇస్తామన్నారు. మరో అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ సర్పంచ్‌లు లక్షలాది అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపడితే ఇప్పటికీ నిధులు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ పాల్గొన్నారు.

వినియోగదారుల విజయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సకాలంలో చిట్టీ డబ్బులు చెల్లింకపోవడంతో బాధితులు వినియోగదారుల ఫోరంను ఆశ్రయిస్తే విచారించిన కమిషన్ బాధితులకు రూ. 27 వేల పరిహారం చెల్లించాలని చిట్‌ఫండ్ కంపెనీ ఆదేశిస్తూ తీర్పు ఇచ్చినట్లు కన్స్యూమర్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడమ్స్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. 45 రోజుల్లో పరిహారం చెల్లించని పక్షంలో మరో 6 శాతం వడ్డీ కలిపి చెల్లించాలని తెలిపారని వివరించారు. విజయ్‌మోహన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిని బరిలో దింపుతాం



జడ్చర్ల టౌన్: ఎన్నికల్లో జడ్చర్ల నుంచి స్వతంత్ర అభ్యర్థిని బరిలో దింపుతామని రజకసంఘం జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాసులు ప్రకటించారు. సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలనాధికారంలో బీసీలకు సమాన వాటా ఇవ్వకుండా అన్ని రాజకీయ పార్టీలు అణచివేస్తున్నారని ఆరోపించారు. జడ్చర్ల అసెంబ్లీలో బీసీలకు న్యాయం దక్కనందుకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోటీలో ఉంటామన్నారు. బీసీ సామాజిక వర్గం అమూల్యమైన ఓటును ప్రజాసంఘాలు నిలబెట్టిన వ్యక్తికే వేయాలని కోరారు. సమావేశంలో బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై నమ్మకం లేకనే వలసలు



మహమ్మదాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నమ్మకం లేకనే ప్రజలు కాంగ్రెస్ పార్టీలోకి వలసలుగా వస్తున్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం అముదాల గడ్డతండా సర్పంచ్ రమేష్‌నాయక్, యువకులు పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, మాజీ ఎంపీపీ శాంతీబాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి, ఎస్టీసెల్ నాయకుడు పాల్గుణ, సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చేనెల 3నుంచి జిల్లా వ్యాప్తంగా చేపట్టే సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో సిబ్బందితో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ మెరాజుల్లాఖాన్, బాలుయాదవ్, శ్రీనివాస్, గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివించాలి

మరికల్: సమాజంలో ఆడ పిల్లలపై వివక్షత చూపకుండా వారిని చదివించేందుకు తల్లిదండ్రులపై బాధ్యత ఎంతైన ఉందని అంగన్‌వాడీ స్పెషల్ ఆఫీసర్ అనిత అన్నారు. సోమవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటి బచావ్, బేటి పడావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలను కాపాడుకుందాం, వారిని చదివిద్దామని పిలుపునిచ్చారు. అలాగే బడి ఈడు పిల్లలు బడికి వెళ్లేవిధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య

గండేడ్: ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల్లో నాలుగు సంవత్సరాల నుంచి దాదాపు 600 వరకు పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఎందుకు పూర్తి చేయడం లేదని ఆయన సిబ్బంది అడిగారు. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని అలా ఎందుకు చేయడం లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, ప్లాంటేషన్‌లతో పాటు పలు పనులు క్లోజింగ్ చేయాల్సినవి పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన గుర్తించారు. క్లస్టర్ వైజ్‌గా టీఏలతో సమీక్షించారు. మంగళవారం సాయంత్రం పనులు క్లోజింగ్ చేయాలని ఉపాధిహామీ సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డితో పాటు ఏపీఓ హరిశ్చంద్రుడు ఉన్నారు.

బ్యాగ్ ఫిల్లింగ్ ప్రారంభించాలి

గండేడ్: గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచడానికి బ్యాగ్ ఫిల్లింగ్ ప్రారంభించాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మన్సూర్‌పల్లి తండాలో నర్సరీని పరిశీలించారు. ప్రైవేటు భూముల్లో ఉన్న నర్సరీలను వెంటనే ప్రభుత్వ భూమి ఉన్న చోటికి తరలించాలని అన్నారు. నెల నెల అద్దెలు చెల్లించడం గ్రామపంచాయతీలకు భారంగా మారుతుందని ఎక్కడ ప్రభుత్వ భూమి ఉందో అక్కడికి నర్సరీలను తరలించాలన్నారు. మన్సూర్‌పల్లి తండాలో క్రీడా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేయాలని ఆయన గ్రామ కార్యదర్శి మణెమ్మకు సూచించారు. అన్ని గ్రామాల్లో కూడ మొక్కల పెంపకానికి తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గండేడ్: మన్సూర్‌పల్లికి చెందిన గోవిందును హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు కుర్మయ్య పేర్కొన్నారు. సోమవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గోవిందు కుమార్తె కులాంతర వివాహం చేసుకోవడం వల్లే ఆయనపై కక్ష గట్టారని అన్నారు. ఈనెల 25న ఘటన జరిగితే ఇప్పటివరకు అధికారులు గ్రామాన్ని సందర్శించలేదన్నారు. గోవింద కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. మొగులయ్య, భీమయ్య, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తయారీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రాజాపూర్: మండలపరిధిలోని ముదిరెడ్డిపల్లి శివారులో దుందుభీవాగులో ప్రతి రోజూ అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వి ఫిల్టర్ ఇసుక చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నిత్యం 40 నుంచి 50 ట్రాక్టర్‌లు, జేసీబీలు, ఇటాచీలతో ఇసుక మాఫియా పగలు రాత్రి తేడా లేకుండా అక్రమాలకు పాల్పడుతోందన్నారు. విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ ఇసుక తయారీతో వాగుశివారులో పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో పాటు రైతుల వ్యవసాయబోర్లలో నీటి మట్టం అడుగంటి పోతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధి చేశాం..ఆదరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని..ఈసారి ఎన్నికలలో మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధిని చేస్తామని స్థానిక ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎక్వాయపల్లి, వాయిల్‌గడ్డ తండా, పెద్ద ఆదిరాల, రామస్వామి గుట్టతండా తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తలపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మద్యం పట్టివేత



చిన్నచింతకుంట: మండలంలోని సీతారాంపేట, లాల్‌కోట గ్రామాల్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. లాల్‌కోట గ్రామానికి చెందిన కొండలు తన కిరాణం షాపులో అక్రమంగా విక్రయిస్తున్న 16 మద్యం సీసాలను, సీతారాంపేటలో గోరియా నాయక్ విక్రయిస్తున్న 71 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అండగా నిలిచి.. ఆశీర్వదించండి



పార్టీలో చేరిన వారితో అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: 'స్థానికుడిగా.. మీ బిడ్డగా మీ ముందుకు వచ్చాను' ఎన్నికల్లో అండగా ఉండి.. ఆశీర్వదించండి...సమస్యల్ని పరిష్కరిస్తా అని కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపల్లిలో 150 మంది పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ఆరుగ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌తో విసుగుచెందిన ప్రజలు కాంగ్రెస్‌లోకి వలసలుగా వస్తున్నారని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ప్రస్తుత 30 రోజులు ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్త గెలుపు లక్ష్యంగా కృషిచేయాలని అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి నిమ్మబావిగడ్డ, 16వ వార్డులో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు

4న నామినేషన్ వేస్తా



నవాబుపేట: కాంగ్రెస్ టికెట్ కోసం యత్నించిన బంగ్లా రవి వచ్చేనెల 4న జడ్చర్ల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏళ్లుగా పనిచేసినా పార్టీ తనను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, యువత తనకు అండగా ఉన్నారని బలమైన పోటీ ఇవ్వగలనని ధీమా వ్యక్తం చేశారు.

పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ఆరుగ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం ధమగ్నాపురంలోని తన నివాసంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమం అందుతుందన్నారు. కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి గెలుపుకోసం కృషి చేయాలన్నారు. అనంతరం తిమ్మాయపల్లి తండా సమీపంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు ప్రియాంక గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీజేపీకి చెందిన 42వ వార్డు మాజీ కౌన్సిలర్ పల్లవి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. విజయ్‌కుమార్, శంకర్, సతీష్, ఆనంద్ పాల్గొన్నారు.

సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: క్రైస్తవుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తూ వారికి అండగా నిలిచిందని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంబీసీయోస్ చర్చ్‌లో నియోజకవర్గ పాస్టర్లు, క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వారు హాజరైమాట్లాడారు. సీఎం కేసీఆర్ క్రైస్తవుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాస్టర్లకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు, పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపుదాం



ప్రచారం నిర్వహిస్తున్న యెన్నం తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, మెయిన్ స్టేడియంలో సోమవారం మార్నింగ్ వాక్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. యెన్నం మాట్లాడుతూ తెలంగాణ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు సీజే బెనహర్, సాయిబాబా, రాములు యాదవ్, అజ్మత్‌అలీ, అవేజ్, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్లు ఇస్తేనే టికెట్

కోయిల్‌కొండ: కాంగ్రెస్‌లో రూ. కోట్లు ఇచ్చిన వారికే ఎమ్మెల్యే టికెట్లు ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రవీందర్‌రెడ్డి, విజయ్‌భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, పాల్గొన్నారు.



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ మరోసారి ఎమ్మెల్యేగా శ్రీనివాస్‌గౌడ్ గెలుస్తారని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. సోమవారం మంత్రిని ఆయన ఫాం హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి ఆయనకు అందజేశారు.

మండలంలో 'స్పెషల్' తనిఖీలు



తీగలపల్లి సమీపంలో పోలీసుల తనిఖీలు

నవాబుపేట: ఎన్నికల నేపథ్యంలో మండలంలో స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. నవాబుపేట ఎస్ఐ పురుషోత్తం నేతృత్వంలో సోమవారం తీగలపల్లి, సిద్దోటం, కాకర్లపహాడ్ సమీపంలో కార్యక్రమం చేపట్టారు. నిబంధనలకు మించి నగదు, లిక్కర్ తదితర వాటిపై చర్యలు తప్పవన్నారు.

మౌలిక వసతుల ఏర్పాటు



పోలింగ్ బూత్‌వద్ద ఎంపీడీఓ

కోయిల్‌కొండ: మండలంలో ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జయరాములు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని బూత్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో తైక్వాండో ఎంపికలు



పోటీల్లో ఎంపికైన విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సోమవారం తైక్వాండో పోటీల ఎంపికలు నిర్వహించారు. ఈమేరకు పీయూ పరిధిలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారు వారం రోజుల శిక్షణ అనంతరం వచ్చే నెలలో రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. పీడీ శ్రీనివాస్, సత్యభాస్కర్, బాబుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



ఫోటో30ఎంబీఎస్ఆర్ఎల్900: రక్తదాన శిబిరం ప్రారంభం చేస్తున్న ఏఎస్పీ రాములు

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివని జిల్లా అదనపు ఎస్పీ రాములు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానంపై అపోహలు అవసరం లేదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. దేశంతో పాటు రేపటి పౌరుల భవిష్యత్ కోసం సంఘవిద్రోహశక్తులతో ఎంతో మంది పోలీసులు పోరాడి ప్రాణత్యాగాలు చేశారన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి తలసేమియా, క్యాన్సర్, మెడికల్ అత్యవసర ఉన్న రోగులకు, ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తదానం చేయాలన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బందిన ఇచ్చిన రక్త యూనిట్లు జనరల్ ఆస్పత్రితో పాటు రెడ్‌క్రాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, ఆర్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇబ్రహీంనగర్‌లో కాంగ్రెస్ ప్రచారం

కోయిల్‌కొండ: మండలంలోని ఇబ్రహీంనగర్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రవీందర్, విద్యాసాగర్, రాములుగౌడ్, బండియాదవ్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు హరీందర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, నర్సిములు, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: పుట్టోనిపల్లితండా ఉప సర్పంచ్ చందునాయక్ సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ లోకేషనాయక్ సైతం ఉన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్, ఎంపీటీసీ తులసీరాం నాయక్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచార జోరు



కోయిల్‌కొండలో ప్రచారం

కోయిల్‌కొండ: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు కృష్ణయ్య రాజ్‌కుమార్, కుమ్మరిరాజు, శమీం, శేఖర్, పానుగంటినాగేశ్, శ్యాంసుందర్, జాయిద్, లక్ష్మీనారాయణ, నరేష్, శ్రీను, గులాం, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్‌స్తంభం



స్తంభం వద్ద అడ్డుగా పెట్టిన రాళ్లు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ భాగ్యేశ్వరాలయం పక్కన విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం ఒరిగిపోయిందని దాని పక్కనే మరోటి ఏర్పాటు చేశారు. విద్యుత్ కనెక్షన్లు సైతం అదే స్తంభానికి ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా పాత స్తంభం ఇంకా తొలగించలేదు. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. స్తంభం పడిపోయేందుకు సిద్ధంగా ఉండటంతో కాలనీవాసులు దానికి బండరాళ్లను అడ్డుగా ఉంచారు. వెంటనే తొలగించాలని కోరుతున్నారు. అదేవిధంగా ఇదే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నిరుపయోగంగా ఉందని.. దాని వల్ల రోడ్డు ఇరుకుగా మారిపోయిందని చెబుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరు తున్నారు.

అప్‘డేట్’ కష్టాలు

- అడ్డాకులలో పనిచేయని ఆధార్ కేంద్రం
- ఎస్‌బీఐలో బారులు తీరుతున్న వినియోగదారులు
- మూసాపేటలో ఇప్పటి వరకు ఏర్పాటు కాని వైనం



అడ్డాకుల ఎస్‌బీఐలో అప్‌డేట్ కోసం కిక్కిరిసిన జనం

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో ఆధార్ కార్డు అప్‌డేట్ కష్టాలు కొనసాగుతున్నాయి. అడ్డాకుల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం వద్ద నిత్యం రద్దీ కనిపిస్తోంది. రేషన్ కార్డులో పేర్లున్న వారికి ఈ-కేవైసీ చేయడానికి ఆధార్ కార్డును అప్‌డేట్ చేయాల్సి రావడంతో తల్లిదండ్రులకు కష్టాలు మొదలయ్యాయి. ఈ-కేవైసీ చేయించుకోని వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో అడ్డాకుల ఎస్‌బీఐలో ఉన్న ఆధార్ కేంద్రం వద్ద చిన్న పిల్లల తల్లిదండ్రులు బారులు తీరుతున్నారు. చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు తీసుకున్నప్పుడు చేతి వేలి ముద్రలు తీసుకోకపోవడంతో ఇప్పుడు వాటిని అప్‌డేట్ చేయాల్సి వస్తోంది.

రెండు మండలాల్లో ‘ఒక్కటే’

అడ్డాకుల మీసేవలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సుమారు ఏడాది నుంచి పని చేయడం లేదు. ఇక మూసాపేట కొత్త మండలంగా ఏర్పడినా ఇప్పటి వరకు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం రేషన్ కార్డులకు ఈ-కేవైసీ తప్పని సరి కావడంతో చిన్న పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయాల్సి వస్తోంది. దీనివల్ల ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక రెండు మండలాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అడ్డాకుల ఎస్‌బీఐలో వరుస కడుతున్నారు. రెండు మండలాలకు చెందిన వారు ఒకే కేంద్రానికి వస్తుండటంతో బ్యాంకు పరిసరాలు కిక్కిరిసి పోతున్నాయి. మూసాపేట మండలానికి చెందిన కొందరు భూత్పూర్, మహబూబ్‌నగర్ వెళ్తున్నారు. అడ్డాకుల ఎస్‌బీఐలో ఒక రోజులో పని కాకపోవడంతో రెండు, మూడు రోజులు తిరగాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. రెండు మండలాల్లోని మీసేవ కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు.